మంత్రివర్యా.. ఇది కాదా అభివృద్ధి..!

- ఐదేళ్లలో రూ.435 కోట్లతో 'ఉత్తర' నియోజకవర్గ అభివృద్ధి
- వైఎస్సార్ సీపీ పాలనలో రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం
- అయినా రోడ్లపై 'తట్టెడు మట్టి పోయలేదంటూ' మంత్రుల దుష్ప్రచారం
- కూటమి నాయకుల అసత్య ప్రచారంపై నియోజకవర్గ ప్రజల మండిపాటు


2022లో మర్రిపాలెం బీఆర్‌టీఎస్‌లో రహదారి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న జీవీఎంసీ అధికారులు

కంచరపాలెం : వైఎస్సార్‌సీపీ నేతలు ప్రజాధనం దోచుకుని తమ అవసరాలు పూడ్చుకున్నారే తప్ప రోడ్లపై గుంతలు కూడా పూడ్చలేదంటూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి మాటలతో నగర ప్రజలు విస్తుపోతున్నారు. ముఖ్యంగా మంత్రి మాటలపై విశాఖ ఉత్తర నియోజకవర్గ ప్రజలు మండిపడుతున్నారు. గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిందంతా అభివృద్ధి కాదా మంత్రి గారూ..! అంటూ స్థానికులు నిలదీస్తున్నారు. అసలేం జరిగిందంటే... విశాఖ నగర పర్యటనలో భాగంగా గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని శనివారం చేపట్టిన మంత్రి డోలా మాట్లాడుతూ నగర ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. కనీస అభివృద్ధి జరగలేదన్నట్లు మాట్లాడారు. వాస్తవానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నగరవ్యాప్తంగా వేల కోట్ల రూపాయలతో బీటీ, సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించారు. ముఖ్యంగా 'ఉత్తర' నియోజకవర్గంలోని కంచరపాలెం, మర్రిపాలెం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, సీతమ్మధార, సీతంపేట... ఇలా అన్ని ప్రాంతాల్లో కలిపి రోడ్ల నిర్మాణానికే రూ.94 కోట్లకు పైగా ఖర్చు చేశారన్న విషయం ఇక్కడి ప్రజలందరికీ తెలిసిన విషయమే. తాగునీరు, డ్రైనేజీల నిర్మాణం, ఆధునికీకరణ, కొండవాలు ప్రాంతాల్లో మెట్ల మార్గాల నిర్మాణానికి కలిపి మొత్తంగా రూ.435 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి చేశారు. ఈ పనులన్నీ జీవీఎంసీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలోనే పూర్తయ్యాయి. అయినప్పటికీ కూటమి నాయకులు, మంత్రులు అసత్య ప్రచారం చేస్తుండడంపై నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మండిపడుతున్నారు. గత ప్రభుత్వంలో నగరం ఎంతో అభివృద్ధి చెందిందని... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా మంత్రులు అభివృద్ధిపై మాట్లాడడమే తప్ప... ఎక్కడా అభివృద్ధి చేసింది లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వాన్ని సాగనంపే రోజులు ప్రారంభమయ్యాయని, ఐదు నెలల్లో పాలకులు చేసిందేమీ లేదని స్థానిక ప్రజలు అంటున్నారు.


ఐటీఐ కూడలిలో నిర్మించిన బీటీ రహదారి


2023లో కంచరపాలెం నేతాజీ కూడలిలో సుందరంగా నిర్మించిన రోడ్డు


జ్ఞానాపురంలో 2023లో బీటీ రహదారి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు


104 ఏరియాలో నిర్మించిన రహదారి

క్లుప్తంగా

అలరించిన గాత్ర కచేరీ


కీర్తనలు ఆలపిస్తున్న జాగర్లపూడి మాధవికృష్ణ శిష్య బృందం

సీతంపేట : శ్రీలలితాపీఠంలో నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరీ ఆహూతులను అలరించింది. జాగర్లపూడి మాధవికృష్ణ, ఆమె శిష్య బృందం త్యాగరాజ, అన్నమయ్య కీర్తనలను మృదుమధురంగా ఆలపించి భక్తులను రంజింపజేశారు. వీరికి ఎస్‌వీఎస్ కృష్ణప్రియ వయోలిన్‌పై, టి.ఎస్.చైతన్య మృదంగంపై వాద్య సహకారం అందించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయకులను, కళాకారులను ఘనంగా సత్కరించారు.

గంగకు పరిహారం చెల్లించాలి

సీతమ్మధార : విశాఖపట్నంలో ఎన్నడూలేని విధంగా విచారణ పేరుతో గంగ అనే పని మనిషిని ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో దారుణంగా కొట్టి, కాలు విరగ్గొట్టిన ఘటనకు బాధ్యులైన క్రైం ఎస్‌ఐ జగదీష్‌ను సస్పెండ్ చేయడం సంతోషకరమని సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ఉపాధ్యక్షురాలు పి.మణి శనివారం ధన్యవాదాలు తెలిపారు. అతనికి సహకరించిన సీఐ బంగారు పాపపై శాఖాపరమైన చర్యలకు ఆదేశించిన సీపీ శంఖబ్రత బాగ్చికి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ఈ ఘటనకు కారకురాలైన ఆక్సిజన్ టవర్స్‌లో నివసిస్తున్న 820 నంబరు ప్లాట్ యజమాని ప్రియాంకపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. పోలీసుల దౌర్జన్యానికి బలైన గంగకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

సీతమ్మధార : వివాహేతర సంబంధం కారణంగా జరిగిన గొడవలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ద్వారకా జోన్ పోలీసులు తెలిపారు. సీతంపేటకు చెందిన సురేంద్రగుప్తా (72), కనకానందం (54) మధ్య కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం నడుస్తోంది. ఇటీవల ఆమెకు క్యాన్సర్ నిర్ధారణ కావడంతో గుప్తా పట్టించుకోవడం మానేశారు. ఈ నేపథ్యంలో గత నెల 24న ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఆ కోపంతో సురేంద్రగుప్తాపై కనకానందం పెట్రోల్ పోసి నిప్పు అంటించడంతో తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న గుప్తా ప్రాణాలు కోల్పోయాడు.

14 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : అక్రమంగా తరలిస్తున్న 14 కేజీల గంజాయిని విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్‌ఐ ఎస్‌కే అబ్దుల్ మారుఫ్, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ చిట్టిబాబు సిబ్బందితో విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన గడదేస గణపతి అక్రమంగా తరలించేందుకు తీసుకొచ్చిన 14 కేజీల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని రిమాండు నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తులకు రిమాండ్

సీతమ్మధార : రైల్వేస్టేషన్ సమీపంలో ప్రయాణికుడి నగదు లాక్కొని దౌర్జన్యానికి పాల్పడిన నలుగురిని ఫోర్తుటౌన్ క్రైం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. క్రైం ఎస్‌ఐ దేముడు నాయుడు తెలిపిన వివరాల ప్రకారం ... జార్ఖండ్ ప్రాంతానికి చెందిన టౌసిక్ (22) అక్టోబర్ 27న సాయంత్రం నాలుగు గంటల సమయంలో రైలు దిగి స్టేషన్ బయటకు వచ్చాడు. ఆ సమయంలో కొమ్మాదికి చెందిన రాగూర్ నాగరాజు, మద్దిలపాలెంకు చెందిన కిలిమి రాము, చల్లపల్లి మురళీకృష్ణ, కొండపు రవి కలిసి టౌసిక్ వద్ద ఉన్న రూ.2 వేలు లాక్కొని దౌర్జన్యానికి పాల్పడ్డారు. అనంతరం బాధితుడు ఫోర్తుటౌన్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నైపుణ్యాభివృద్ధితోనే ఉత్తమ అవకాశాలు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

మురళీనగర్ : విద్యార్థులు తమ రంగానికి సంబంధించి నైపుణ్యాలు మెరుగుపరచుకున్నప్పుడే ఉన్నత అవకాశాలు లభిస్తాయని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు సూచించారు. బిల్డింగ్ రెజిలియన్స్ అండ్ కోపింగ్ స్కిల్స్ ఫర్ సక్సెస్ ఇన్ ఎడ్యుకేషన్ అండ్ లైఫ్ సంస్థ ప్రతినిధి డాక్టర్ జయపూజిత అధ్యక్షతన నైపుణ్యాల సాధనపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మంచి మిత్రులతో స్నేహం చేయడం వల్ల జ్ఞాన సంపద పెరుగుతుందన్నారు. చెడు సావాసాలకు దూరంగా ఉండాలన్నారు. డాక్టర్ జయపూజిత మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. భవిష్యత్‌లో నిర్దేశిత లక్ష్యాలు సాధించాలంటే క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీ రమణ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి


మాట్లాడుతున్న ఇస్కఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ మార్కండేయులు

సీతంపేట : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని ఇస్కఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. ఇస్కఫ్ జిల్లా సర్వసభ్య సమావేశం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ మార్కండేయులు మాట్లాడుతూ వచ్చేనెల జరగనున్న జానపద కళా ప్రదర్శనకు రాష్ట్ర టూరిజం మంత్రిని ఆహ్వానించాలని కళాకారుల సంఘం భావించిందన్నారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇస్కఫ్ జిల్లా కార్యవర్గంలో ఒకరైన జె.వి.ప్రభాకర్ కొంత కాలంగా తనే అధ్యక్షుని‌గా సమావేశాలు ఏర్పాటు చేస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని, అతనిపై రాష్ట్ర నాయకత్వం చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో మధుమతి, ఎంఏ బేగం, సత్యవతి, సూర్యకుమారి పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం


మాట్లాడుతున్న రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

సీతంపేట : జనసైనికులంతా అంకితభావంతో రాష్ట్ర నిర్మాణం కోసం కలిసికట్టుగా పని చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. సీతంపేటలో గల జనసేన నగర కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఆ పార్టీ నగర అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నాదెండ్ల మనోహర్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ 2019లో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై చేపట్టిన లాంగ్‌మార్చ్‌తో జనసేన ప్రజల పక్షాన పోరాటం ప్రారంభించిందని గుర్తు చేశారు. పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసోత్సవాలకు ఆహ్వానం


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకి ఆహ్వాన పత్రిక, ప్రసాదం అందజేస్తున్న ఈవో ప్రసాద్‌బాబు

సీతమ్మధార : కార్తీకమాస ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకి శ్రీ ఉమానీలకంఠేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) బండారు ప్రసాద్‌బాబు ఆహ్వానం అందజేశారు. ఈ మేరకు బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో గల ఎమ్మెల్యే నివాసంలో శనివారం ఆయనను కలిసి ఆహ్వాన పత్రికతోపాటు ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ నక్కవానిపాలెంలో గల దేవస్థానంలో ఈ ఏడాది కార్తీకమాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. నవంబర్ 2 నుంచి డిసెంబర్ ఒకటి వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. వారితో పాటు ఆలయ సిబ్బంది శివ ప్రసాద్, అర్చకులు ఉమామహేష్ ఉన్నారు.

ఎన్‌ఎంసీహెచ్‌లో విజిలెన్స్ వారోత్సవాలు

సీతమ్మధార : స్థానిక పీఅండ్‌టీ కాలనీలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ (ఎన్‌ఎంసీహెచ్)లో శనివారం విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయురాలు వరలక్ష్మి నేతృత్వంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిజాయతీగా జీవిస్తామని, లంచగొండితనంపై ఫిర్యాదు చేస్తామని, ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తామని, విలువలతో జీవిస్తామని విద్యార్థులతో బ్యాంక్ చీఫ్ మేనేజర్ దిలిప్ శుక్లా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కె.రాజ్యలక్ష్మి, ఆడిటర్ శ్రీ ప్రసాద్, కె.ఉదయభాస్కర్, శేఖర్, హెచ్‌ఎం డి.రాంప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ. 18.36 లక్షలు


నగదు లెక్కిస్తున్న సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు

కంచరపాలెం: జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో శనివారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు అమ్మవారి హుండీల లెక్కింపు నిర్వహించారు. 52 రోజులకు గాను అమ్మవారికి ముడుపులు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.18,36,316 వచ్చినట్లు ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. పెందుర్తి వేంకటేశ్వర స్వామి ఆలయ ఈవో ఎం.నీలిమ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. కంచరపాలెం పోలీస్ సిబ్బంది, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీవారి స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన త్యాగరాజ కృతులు



కృతులు అలపిస్తున్న గాయని ముట్నూరి జలజాక్షి

సీతంపేట : కార్తికేయ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నెలవారీ సంగీత కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక బీవీకే కళాశాలలో నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరి ప్రేక్షకులను అలరించింది. ప్రముఖ గాయని ముట్నూరి జలజాక్షి తనదైన గాత్రంతో త్యాగరాజ, అన్నమయ్య, ముత్తుస్వామి దీక్షితార్ కీర్తనలను రమ్యంగా ఆలపించి శ్రోతలను ఆకట్టుకున్నారు. ఆమెకు ఎంఎస్ఎన్ మూర్తి వయోలిన్‌పై, వంకాయల వెంకట రమణమూర్తి మృదంగంపై, ఎం.హరిబాబు ఘటంపై వాద్య సహకారం అందజేశారు. కార్తికేయ కళాక్షేత్రం వ్యవస్థాపకురాలు నిష్టల కృష్ణవేణి పర్యవేక్షించారు.

తహసీల్దార్ కార్యాలయంలో బోరు ఏర్పాటు


తహసీల్దార్ కార్యాలయంలో బోరు వేస్తున్న సిబ్బంది

సీతమ్మధార : సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో బోరు వేయడంతో సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా ఇక్కడి కార్యాలయంలో బోరు లేక నీటి కోసం ఇబ్బంది పడేవారు. కుళాయి కనెక్షన్ ఉన్నప్పటికీ చాలీచాలని నీరే వచ్చేది. ఈ సమస్యను సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ ఎం.రమేష్ ఇటీవల ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో జీవీఎంసీ అధికారులు శనివారం బోరు వేశారు. దీంతో తహసీల్దార్‌తో పాటు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డుపై భవన నిర్మాణ సామగ్రితో ఇబ్బందులు


జీవీఎంసీ 24వ వార్డు టీపీటీ కాలనీలో రోడ్డుపై భవన నిర్మాణ సామగ్రి

సీతమ్మధార : భవన నిర్మాణ యజమానులు ఇష్టారాజ్యంగా రోడ్లపై అడ్డంగా ఇసుక, పిక్క వేయడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ 24వ వార్డు టీపీటీ కాలనీలో సాయిబాబా మందిర రోడ్డులో ఓ భవన నిర్మాణ యజమాని తన స్వార్థం కోసం రోడ్డు మూసేసి పనులు చేస్తున్నాడు. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ప్రాంతంలో చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకొందని స్థానికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, జీవీఎంసీ జోన్ – 3 పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

వైభవంగా సుప్రభాత సేవ


వైభవుని సన్నిధిలో ఆకాశదీపం వదులుతున్న అర్చకుడు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో బాలభోగం, అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, సామూహిక విష్ణు సహస్రనామార్చన, రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు.

సాయంత్రం నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి సమర్పించారు. అనంతరం కార్తీక దీపారాధన ప్రారంభించారు. అర్చకులు వాసుదేవాచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో ఆకాశదీపం వదిలారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కార్తీక మాసోత్సవాలు ప్రారంభం


శివునికి అభిషేకం చేస్తున్న అర్చకులు


సీతంపేట పార్వతీశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సీతంపేట : దేవదాయశాఖ పరిధిలో గల శివాలయాల్లో శనివారం తెల్లవారుజాము నుంచి కార్తీక మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 25వ వార్డు సీతంపేటలోని పార్వతీశ్వరాలయం, 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయాల్లో తెల్లవారుజామున శివలింగాలకు ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపి పూజలు ప్రారంభించారు. కార్తీక మాసం తొలిరోజు కావడంతో పలువురు భక్తులు ఆలయాలను దర్శించి పూజలు చేశారు. అలాగే సాయంత్రం భక్తులు ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించారు. ఆలయ అర్చకులు ఆకాశ దీపం ఏర్పాటు చేశారు. సీతంపేట పార్వతీశ్వరాలయంలో పార్వతీశ్వరునికి మేళ తాళాలతో ప్రత్యేక హారతులిచ్చారు.

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో గల శ్రీ ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం తొలిరోజు శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. అర్చకులు రామారావు శర్మ ఆధ్వర్యంలో కార్యనిర్వహణాధికారి ప్రసాద్ బాబు ప్రత్యేక పూజలు చేశారు. నెల రోజులపాటు ప్రత్యేక పూజలు చేయిస్తామని ఈవో తెలిపారు. నవంబర్ 15న జ్వాలా తోరణ ఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా దేవాలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.